ఈ వేసవిలో ఇరిగేషన్ పనులు పూర్తి చేయాలి



ఇరిగేషన్‌శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తోన్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: ఈ వేసవిలో ఇరిగేషన్ పెండింగ్ పనులు దాదాపుగా పూర్తయ్యేలా ప్రణాళిక తయారుచేసి పూర్తి చేయాలని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ముదునూరి శుక్రవారం తన కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓఅండ్‌ఎం గ్రాంట్‌లో టెండర్ల ప్రక్రియ పూర్తయిన పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని చెప్పారు. ఓఅండ్‌ఎం గ్రాంట్ నుంచి నరసాపురం ఇరిగేషన్ సెక్షన్‌లో రూ.2 కోట్లు, కాళీపట్నం ఇరిగేషన్ సెక్షన్‌లో రూ.1.16 కోట్లుతో ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. ఈ పనులు పరిపాలనా అనుమతులు తీసుకుని టెండర్ల దశకు తీసుకురావాల్సి ఉందన్నారు. ఇప్పటికే వియర్ ఛానల్ ప్రక్షాళనకు రూ.24 కోట్లు, శేషాతారం ఛానల్ అభివృద్ధికి రూ.7.80 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. వీటికి సంబంధించి టెండర్ల ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అధికారులు విధుల్లో అలసత్వం వహించవద్దని చెప్పారు. కాలువలు కట్టేసి, వదిలే సమయానికి పనుల్లో పురోగతి కనిపించాలని చెప్పారు. ఈ సమావేశంలో ఇరిగేషన్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

నరసాపురం: విద్యాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యనిస్తోందని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు పేర్కొన్నారు. పట్టణంలోని రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ నళినీజీన్‌కు మార్‌కు చెందిన ఐరీష్ ఫ్లోరెస్ట్ ప్లే స్కూల్ 6వ వార్షికోత్సవ వేడుక శుక్రవారం రాయిపేటలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ముదునూరి మాట్లాడుతూ ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు సేవా దృక్పదంతో పాఠశాలలను నడపాలని సూచించారు. తక్కువ ఫీజులతో విద్యనందించాలని చెప్పారు. చదవులో ప్రతిభ చూపించిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సికలే పెర్సిపాల్, వై.జాన్‌కుమార్, చదలవాడ జ్ఞానప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్రలో ముగిసిన హ్యాకథాన్-2కే 23

నరసాపురం రూరల్: నరసాపురం మండలం సీతారాంపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు నిర్వహించిన హ్యాకథాన్-2కే 23 సదస్సు శుక్రవారం ముగిసింది. స్వర్ణాంధ్ర కళాశాల, బ్రెయిన్ ఓ విజన్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు రూపొందించిన డేటాసైన్స్ అప్లికేషన్లు, వెబ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను ప్రదర్శించారు. వివిధ ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన 350 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్య అతిథి సీఎస్ఆర్ కన్సల్టెంట్ ఫౌండర్ కవితా నటరాజన్ పాల్గొన్నారు. కళాశాల చైర్మన్ కేవీ సత్యనారాయణ, కోశాధికారి కేవీ స్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ సురేష్ కుమార్, డాక్టర్ పి పండరీనాథ్, వివిధ విభాగాధిపతులు పి శ్రీనివాసులు, వివిఎస్ వి ప్రసాద్, ఎఎస్ఎల్ కుమార్, టి మురళీ మోహన్, హ్యాకథాన్ కన్వీనర్ డాక్టర్ బొమ్మ రామకృష్ణ, పి వంశీకృష్ణరాజా పాల్గొన్నారు.

క్లుప్తంగా

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జిలు

నరసాపురం: మే 13న నరసాపురం కోర్టు సముదాయంలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని నరసాపురం సీనియర్ సివిల్‌జడ్జి వై.శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి వి.గౌరీశంకరరావు సూచించారు. శుక్రవారం కోర్టుహాల్‌లో లోక్‌అదాలత్ నిర్వహణపై న్యాయవాదులతో సమీక్ష నిర్వహించారు. గత లోక్ అదాలత్‌లో కంటే ఎక్కువ కేసులు రాజీ జరిగేలా కక్షిదారులను చైతన్యం చేయాలన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా డబ్బు, సమయం ఆదా అవుతాయని చెప్పారు. రాజీ చేసుకోదగ్గ క్రిమినల్, సివిల్, చెక్‌బౌన్స్ కేసులు పరిష్కరించుకోవచ్చని చెప్పారు.

చురుగ్గా రహదారి నిర్మాణ పనులు



ఆకనవారితోటలో సీసీ రోడ్డు పనులు పర్యవేక్షిస్తున్న డీఈ సూర్యకుమార్

మొగల్తూరు: రామన్నపాలెం పంచాయతీ ఆకనవారితోటలో సీసీ రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఆకనవారితోట నుంచి లక్కువారితోట వరకు గతంలో పీఎంజీఎస్‌వై నిధులతో వేసిన తారు రోడ్డు గోతుల, గొప్పులతో అధ్వానంగా తయారైంది. పీఎంజీఎస్‌వై నుంచి నిర్వాహణ నిధులు రూ.1.12 కోట్ల నిధులు మంజూరుతో పాటు తారు రోడ్డు స్థానంలో సీసీ రోడ్డు నిర్మించాలని సూచించారని పంచాయతీరాజ్ ప్రాజెక్టు డీఈ సూర్యకుమార్ గురువారం తెలిపారు. ఆకనవారితోట ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి లక్కువారితోట వరకు సుమారు 1.8 కిలోమీటర్ల మేర సీసీ రోడ్డు పనులు నాలుగు రోజుల నుంచి చేపట్టామని ఆయన తెలిపారు.

సేమియా వితరణ



పాలకొల్లు అల్లు రామలింగయ్య కూడలిలో సేమియా పంపిణీ చేస్తున్న షేక్ రసూల్

పాలకొల్లు అర్బన్: రంజాన్ సందర్భంగా మత సామరస్యాన్ని చాటుతూ పట్టణంలోని అల్లు రామలింగయ్య కూడలిలో శుక్రవారం రసూల్ సేవా సంస్థ ఆధ్వర్యంలో సేమియా వితరణ చేశారు. సంస్థ అధ్యక్షుడు షేక్ రసూల్ మాట్లాడుతూ 20 ఏళ్లగా రంజాన్ పండుగ సందర్భంగా సేమియా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు షేక్ బాబాజీ, షేక్ చాంద్ బీబీ, అట్టాడ సీతారాం, శిడగం లింగం, పెంటు సాహెబ్, షేక్ హజరత్ వలీ, షహీనా, పరిష్మా పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభం



గుమ్మలూరులో ఉపాధి హామీ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

పోడూరు: ఉపాధిహామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని గుమ్మలూరు సర్పంచ్ గొట్టుముక్కల సోనియా రమేష్ పిలుపునిచ్చారు. గుమ్మలూరులో ఉపాధిహామీ పనుల్లో భాగంగా శుక్రవారం చినపేట పంట బోది తవ్వకం పనులను ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో కూలీలందరికీ జాబ్‌కార్డులు అందజేసి కూలీలందరికీ పూర్తిస్థాయిలో పనులు కల్పించేలా ఉపాధి హామీ సిబ్బంది కృషి చేయాలన్నారు. పనులకు హాజరైన కూలీలకు ఎటువంటి ఇబ్బందులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నేలపూడి సురేష్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



ఆచంటలో చలి వేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ కోట సరోజినీ

పెనుగొండ: ఆచంటలో పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ కోట సరోజినీ వెంకటేశ్వరరావు శుక్రవారం ప్రారంభించారు. రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్, గ్రామ అధ్యక్షుడు పెచ్చెట్టి సత్యనారాయణ, కోట వెంకటేశ్వరరావు, ఎంపీడీవో జగన్నాథరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రారంభం



మార్టేరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న



ఎస్ ఇల్లిందలపర్రులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి

పెనుమంట్ర: రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని ఎంపీపీ కర్రి వెంకటనారాయణరెడ్డి (వాసు) అన్నారు. శుక్రవారం పెనుగొండ ఏఎంసీ చైర్ పర్సన్ వెలగల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణితో కలిసి ఎస్ ఇల్లిందలపర్రు, పెనుమంట్ర, మాముడూరు, మార్టేరు రైతు భరోసా కేంద్రాల వద్ద కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం ఉచితంగా గోనె సంచులు సరఫరా చేయడమే కాకుండా లేబర్ ఛార్జీలు రవాణా ఖర్చులు ప్రభుత్వం భరిస్తుందని ఆయన అన్నారు. రైతులు పండించిన ధాన్యం ఆర్‌బీకేల ద్వారా విక్రయించాలనే నిబంధన లేదని, కనీస మద్దతు ధర అంతకన్నా ఎక్కువ ధర బయట నుంచి రావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అంతకంటే ఎక్కువ ధర లభిస్తే రైతు తన ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులకు, లేదా రైస్ మిల్లర్లకు విక్రయించుకునేందుకు పూర్తి స్వేచ్ఛ ఉందని, రైతు ఈ సమాచారాన్ని ఆర్‌బీకేకు తప్పని సరిగా తెలియజేయాలన్నారు. రైతులు తమ ధాన్యా న్ని ఎటువంటి ఇబ్బందులు లేకుండా విక్రయించుకునేలా ప్రభుత్వ అధికారులతో మాజీ మంత్రి, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా తొలుత ఎస్ ఇల్లిందలపర్రులోని, తదుపరి పెనుమంట్ర, మాముడూరు, మార్టేరు గ్రామాల్లో ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం మిగిలిన 14 గ్రామాల్లోనూ ఆయా గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు రైతు భరోసా కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలుకు శ్రీకారం చుట్టారు. ఎస్ ఇల్లిందలపర్రు సర్పంచ్ వనుం సూర్యనారాయణ, సొసైటీ అధ్యక్షుడు కర్రి శంకర శ్రీరామారెడ్డి, పెనుమంట్రలో ఉపసర్పంచ్ భూపతిరాజు శ్రీనివాసరాజు, ఎంపీటీసీ సభ్యురాలు చింతపల్లి మంగాదేవి, మాముడూరులో సర్పంచ్ దేవేంద్రుడు, మండల ఉపాధ్యక్షులు వాసంశెట్టి కిరణ్, మార్టేరులో గ్రామ సర్పంచ్ మట్టాకుమారి, ఉపసర్పంచ్ కర్రి వేణుబాబు, సొసైటీ అధ్యక్షుడు అల్లం భాస్కరరెడ్డి, తహసీల్దార్ ఏవీస్ అశోక్‌వర్మ, ఎంపీడీవో పూర్ణబాబ్జి, మండల వ్యవసాయశాఖ అధికారి మద్దాల జయమాధురి, ఓడూరు సర్పంచ్ బుర్రా రవికుమార్ పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు అందరూ అండగా నిలవాలి

- రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్
- ములపర్రు పితానివారి పాలెంలో 'జగనన్నే మా భవిష్యత్తు'



ములపర్రు పితాని వారి పాలెంలో స్టిక్కరు అతికిస్తున్న ఎంపీ పిల్లి బోస్, శ్రీరంగనాథరాజు

పెనుగొండ: రాబోయే ఎన్నికల్లో ఇప్పటి వరకూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు రద్దు చేస్తామని చెప్పే దమ్ము, ధైర్యం చంద్రబాబుకు ఉందా అని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుబాష్ చంద్రబోస్ ప్రశ్నించారు. శుక్రవారం పెనుగొండ మండలం ములపర్రు పితాని వారి పాలెంలో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్‌లో కార్యక్రమంలో మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజుతో కలిసి పాల్గొని సర్వే నిర్వహించి, ప్రజల అనుమతులు మేరకు గృహాలకు స్టిక్కరు అంటించారు. నిన్న మొన్నటి వరకూ సంక్షేమ పథకాలపై విమర్శలు చేసిన తెలుగుదేశం నాయకులు నేడు స్వరం మారుస్తూ సీఎం జగన్ సంక్షేమ పథకాలను ప్రశంసిస్తున్నారన్నారు. సీఎం జగన్‌కు అందరూ అండగా నిలవాలని కోరారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వెలగల వెంకటరమణ, ఎంపీపీలు పూతినీడి పెద్ద, కర్రి వాసు, జెడ్పీటీసీ గుంటూరిపెద్దిరాజు, సర్పంచ్ మర్రే రాజేశ్వరి, కార్పొరేషన్ డైరక్టరు బొక్కా అరుణ, సొసైటీ అధ్యక్షుడు యాండ్ర మంగాదేవి, ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు పులిదిండి వెంకటేశ్వరు, కన్వీనర్లు నలిమిల్లి బాబిరెడ్డి, బాలం సత్తిరాజు, సాకా సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ చిన్నం ఏడుకొండలు, ములపర్రు గ్రామ అధ్యక్షుడు కలగట సాగర్, కన్వీనర్లు పితాని సత్యనారాయణ, పితాని పండు, గుత్తుల రాంబాబు, కేశర పల్లి రమేష్, దంపనబోయిన బాబూరావు, కుసుమే రాంబాబు, జక్కంశెట్టి శ్రీరాములు పాల్గొన్నారు.

పాఠశాలలో సామాజిక తనిఖీపై అవగాహన



మొగల్తూరులో ప్రధానోపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో పుష్పరాజ్యం

మొగల్తూరు: పాఠశాలలో నిర్వహించే సామాజిక తనిఖీ నిష్పక్షపాతంగా ఉండాలని ఎంఈవో పుష్పరాజ్యం సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పాఠశాలకు సంబంధించిన మౌలిక వసతులు, నిధుల విడుదల, ఖర్చుల వివరాలు, జగనన్న విద్యాకిట్లు, మధ్యాహ్న భోజనంపై ప్రగతి, లింగ వివక్షత, పాఠశాల భద్రత తదితర విషయాలపై నిర్వహించే సామాజిక తనిఖీ పూర్తి పారదర్శకంగా ఉండాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల కమిటీ చైర్మన్, సభ్యులు సంయుక్తంగా సామాజిక తనిఖీలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఆర్‌సీ ఆనంద్‌కుమార్, రిసోర్స్ పర్సన్ ఎస్ బుజ్జిబాబు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు



పోడూరులోని లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు పంపిణీ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శుక్రవారం తూర్పుపాలెంలోని కార్యాలయంలో పోడూరుకు చెందిన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. సొంతిల్లు లేని వారు రాష్ట్రంలో ఉండకూడదన్న లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారన్నారు. ఇంటి స్థలాలు పొందిన ప్రతి ఒక్కరూ ఇళ్ల నిర్మాణం చేపట్టి సొంతింటి కల నెరవేర్చుకోవాలన్నారు. భూమి లేని చోట భూసేకరణ చేసి ఇళ్ల పట్టాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆచంట ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య, పోడూరు జెడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు, ఎంపీపీ సబ్బితి సుమంగళి, సర్పంచ్ పోతాబత్తుల సువర్ణరాజు, పార్టీ నాయకులు రుద్రరాజు శివాజీరాజు, చేకూరి సూరిబాబు, గుబ్బల వీరబ్రహ్మం, పోతుమూడి రాచంద్రరావు పాల్గొన్నారు.

గృహసారథిపై దాడి అమానుషం



బాధితురాలిని పరామర్శిస్తున్న గుమ్మాపు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక 10వ వార్డుకు చెందిన వైఎస్సార్ పార్టీ గృహసారథి రొక్కాల మేరీ, ఆమె సోదరుడుపై దాడి చేయడం అమానుషమని పి.వి రావు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మాపు సూర్యవరప్రసాద్ తీవ్రంగా ఖండించారు. శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మేరీని ఆయన పరామర్శించి ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదే వార్డులో మేరీ ఇంటి పక్క పోర్షన్‌లో ఉంటున్న అగ్రవర్ణానికి చెందిన ఇద్దరు మహిళలు, ఒక వ్యక్తి ముగ్గురూ కలిసి కరెంటు బిల్లు విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రిని ఉద్దేశించి దుర్భాషలాడటంతో దీనిపై ప్రశ్నించినందుకు మేరీని తిడుతూ దారుణంగా కొట్టారన్నారు. దాడికి యత్నించిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుని, బాధితురాలికి న్యాయం చేయాలని సూర్యప్రసాద్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోలీస్‌స్టేషన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

సంఘం అభివృద్ధికి కృషి చేయాలి

నరసాపురం రూరల్: సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ కోరారు. శుక్రవారం పీఎం లంక గ్రామంలో నిర్వహించిన సొసైటీ చైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన చామకూరి నాగేశ్వరరావును ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కడలి పద్మారావు, ఎంపీటీసీ సభ్యుడు రంగారావు, నాయకులు జనార్దనరావు, చామకూరి మోహన్‌రావు, బొక్కా సత్యనారాయణ, కోడి ఆదినారాయణ,తిరుమాని తాతారావు,పులపర్తి సూర్యనారాయణ, తంగెళ్ళ వెంకటరావు, గుబ్బల మోహన్‌రావు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశాలకు 23న రాత పరీక్ష

పెనుగొండ: సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్ సీట్ల కోసం దరఖాస్తున్న చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 23న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పెనుగొండలోని ఏపీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ టి ఎస్తేరు క్వీనీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 23న ఉదయం 10 నుంచి 12 గంటల వరకూ 5వ తరగతికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు, ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటలకు పరీక్ష నిర్వహిస్తామని వివరించారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్, ఆధార్ కార్డులు తప్పని సరిగా తీసుకురావాలని సూచించారు.

జగనన్నతోనే సంక్షేమ రాజ్యం సాధ్యం



కవిటంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం



ముత్యాలపల్లిలో లబ్ధిదారులకు బ్రోచర్లు అందిస్తున్న నాయకులు

పోడూరు: సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనతోనే సంక్షేమరాజ్యం సాధ్యమని కవిటం సొసైటీ చైర్మన్ కర్రి శ్రీనివాసరెడ్డి అన్నా రు. కవిటంలో శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకులు, గృహసారథులు మా నమ్మ కం నువ్వే జగన్ కార్యక్రమం ఉ త్సాహంగా నిర్వ హించారు. సొసై టీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు అంబళ్ల భాస్కరరావు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాలపై ప్రజలను ఆరా తీశారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సంతృప్తికరంగా ఉందా? లేదా? అని ప్రజలను అడిగి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు సత్తి మురళీకృష్ణారెడ్డి తరపట్ల రామకృష్ణ, మాకా శ్రీను, బుడితి భీమారావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

మొగల్తూరు: రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు కావాలంటే జగనన్నే అధికారంలోకి రావాలని పార్టీ నాయకులు పేర్కొన్నారు. జగనన్నే మా భవిష్యత్- మానమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో నాయకులు పర్యటించి లబ్ధిదారులకు బ్రోచర్లు అందిస్తూ, గృహాలకు స్టిక్కర్లు అతికించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారు. నాయకులు, గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడారు. కులాలు, మతాలకతీతంగా అర్హులందరికీ ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలను అందిస్తున్నామని, రాబోయే రోజుల్లో జగనన్నేకే తమ మద్దతు పలకాలని కోరుతున్నారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే కఠిన చర్యలు



ప్లాస్టిక్ గ్లాసులు స్వాధీనం చేసుకుంటున్న కమిషనర్

నరసాపురం: పట్టణంలో వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. శుక్రవారం కమిషనర్ సిబ్బందితో కలిసి పట్టణంలోని పలు దుకాణాలను తనిఖీ చేశారు. ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకుని, వ్యాపారులకు అపరాధ రుసుం విధించారు. వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని కమిషనర్ చెప్పారు. పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రభుత్వం నిషేధించిందని చెప్పారు. రెండోసారి పట్టుబడితే షాపులు సీజ్ చేస్తామని ఆర్ఐ నానాజీ హెచ్చరించారు.

నేటి నుంచి కాళ్లలో అమ్మవార్ల జాతర

కాళ్ల: మండల కేంద్రమైన కాళ్ల గ్రామంలో వేంచేసియున్న గ్రామదేవతలు మహంకాళమ్మ, వెంకమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవ వేడుకలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయని ఉత్సవ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. ఏప్రిల్ 22 శనివారం నుంచి 30వ తేదీ ఆదివారం వరకు అంగరంగ వైభవంగా జాతర మహోత్సవాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం

ఆకివీడు: క్రీడలతో మానసిక ఉల్లాసం సాధ్యపడుతుందని ముస్లిం సంక్షేమ సంఘ కార్యదర్శి, డాక్టర్ బిలాల్ తెలిపారు. రంజాన్ మాసంలో యువత ఉత్సాహంగా ఉండేందుకు ఈ క్రికెట్ పోటీలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా క్రికెట్ పోటీల్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో నాలుగు జట్లు పాల్గొనగా అర్షద్ లెవెన్స్ విజేత కాగా, రన్నర్‌గా ఎహతాష్ లెవెన్స్ జట్టు నిలిచింది. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ సిరీస్‌కు మొహ్మమద్ ఎంపికయ్యారు.ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు.

యువతిని వేధించిన కేసులో యువకుడి అరెస్ట్

మొగల్తూరు: ఓ యువతిని వేధించిన కేసులో యువకుడిని దిశ డీఎస్పీ కె సత్యనారాయణ అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఎం వీరబాబు శుక్రవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం ఖండవిల్లికి చెందిన ఓ యువతి మొగల్తూరు పంచాయతీ నక్కావారిపాలెంలోని వారి బంధువుల ఇంటికి వచ్చింది. ఈనెల 18న ఖండవిల్లికి చెందని యువకుడు నల్లి జయకృష్ణ నక్కావారిపాలెం వచ్చి ఆ యువతిని వేధింపులకు గురి చేశాడు. బాధిత యువతి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేయగా దిశ డీఎస్పీ దర్యాప్తు చేసి యువకుడుని అరెస్ట్ చేశారని ఎస్సై తెలిపారు.